నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

శుక్రవారం 07 ఏప్రిల్ 2023

రామారెడ్డిలో రథోత్సవం



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను రథోత్సవంపై ఉంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, వివిధ యువజన సంఘాలు, గ్రామస్తులు పాల్గొన్నారు. రథోత్సవాలకు ఆటో యూనియన్ తరపున పూల అలంకరణ ఏర్పాటు చేశారు.

మహిళా అదృశ్యం



నవతెలంగాణ-రామారెడ్డి

మహిళా అదృశ్యం అయిన ఘటన అన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన రాసమల్ల దేవలక్ష్మి (35), భైంసా గ్రామానికి చెందిన రాజును ప్రేమించి వివాహం చేసుకుంది. కుటుంబ గొడవల వల్ల దేవలక్ష్మి, అన్నారంలో తల్లి గారి వద్ద ఉంటుంది. ఆదివారం కామారెడ్డి కూలీ పనికి వెళ్తున్న అని ఇంట్లో చెప్పి, ఇంటికి తిరిగి రాకపోవడంతో, చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికిన దొరకకపోవడంతో, గురువారం తల్లి రాసమల్ల రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

- పాల్గొన్న ప్రజాతినిధులు, ప్రముఖులు
- ఆకట్టుకున్న యువత డ్యాన్సులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ వాహిని, ఏబీవీపీ ఆధ్వర్యంలో నగరంలోని కంఠేశ్వర్‌లోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయం నుంచి వీర హనుమాన్ విజయయాత్ర ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకులు ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు, బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షులు జెండా ఊపి ప్రారంభించారు. హనుమాన్ దీక్షల గురుస్వాములు నాగభూషణం కొబ్బరి కాయ కొట్టి జెండా ఊపారు. ఉదయం 11:15 గంటలకు నగరంలోని కంఠేశ్వర్ నుంచి ఈ యాత్ర ప్రారంభమై హమాల్వాడీ, శివాజీచౌక్, పాతగంజ్, దేవిరోడ్, గాంధీచౌక్, నెహ్రూపార్కు, పెద్దబజార్, గోల్‌హనుమాన్ చేరుకుంది. యువకులు పెద్దఎత్తున శోభాయాత్రలో పాల్గొన్నారు. హనుమాన్, ఛత్రపతి శివాజీ విగ్రహాలతో పూరవీధుల గుండా ఉరేగించారు.



కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శోభయాత్ర..



పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో..

శోభాయాత్రకు భారీ బందోబస్తు..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శ్రీ నీలకంఠేశ్వర ఆలయం నుంచి బయలుదేరిన శోభయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్, నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభ యాత్ర తీరును కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ద్వారా చూస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ శోభయాత్రలో అదనపు డీసీపీ (ఎ.ఆర్) పి.గిరిరాజు, పరిపాలన అధికారి (అడ్మిన్) ఎ.సి.పి జి.మధుసుధర్ రావు, నిజామాబాద్, బోధన్, ఎ.ఆర్ ఎ.సి.పిలు ఎమ్.కిరణ్ కుమార్, కె.ఎమ్.కిరణ్ కుమార్, ఎన్. సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : పట్టణంలో విశ్వహిందు పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో భరతమాత, గోమాత, హనుమంతుడు, రాముడి భారీ ప్రతిమలతో పట్టణంలో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ శోభాయాత్రలో నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, రవీందర్ యాదవ్, దాము, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు తదితరులు యాత్రలో పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఇంచార్జి సీపీ

పరిశుభ్రతలో ముందు..



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర జరిగిన ప్రాంతాల్లో నిజామాబాద్ నగరంలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి లోటుపాట్లు జరగకుండా వ్యవహరించారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ ఎప్పటికప్పుడు రోడ్లపైన పడిన వాటర్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, ప్లేట్లు ఇతరత్రా చెత్తను సిబ్బందితో ఎత్తివేయిస్తూ శుభ్రం చేయించారు.



బోధన్‌లో శోభయాత్ర..

రైతుల సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో ఎరువుల సమీకరణ, వాటి పంపిణీ, ప్రస్తుతం పంటల సాగు స్థితిగతులు, రబీలో సాగు చేస్తున్న వరి ధాన్యం సేకరణకు చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. వచ్చే జూన్ మాసం నుంచి ఆగస్టు వరకు మూడు విడతలుగా యూరియా ఎరువును రైతులు ఎక్కువగా వినియోగిస్తారని, ఆ సమయంలో యూరియా కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు వారు సాగు చేస్తున్న పంట విస్తీర్ణాన్ని అనుసరిస్తూ సరిపడా మోతాదులో ఎరువులు అందించాలన్నారు. సరిహద్దునే ఉన్న పొరుగు రాష్ట్రాలకు అక్రమ రవాణా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జాగ్రత్తలు సూచించారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల క్రయవిక్రయాల వివరాలను ఈపాస్ మెషిన్ ద్వారా వెనువెంటనే నమోదు చేసేలా చూడాలన్నారు. కాగా, ప్రస్తుతం వర్ని, బోధన్, కోటగిరి తదితర ప్రాంతాల్లో రబీ వరి పంట కోతలు ప్రారంభం అయ్యాయని, మరో వారం పది రోజుల్లో ఊపందుకుంటాయని కలెక్టర్ తెలిపారు. ఈసారి దాదాపు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు సేకరించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. తరుగు, తూకాలలో రైతులు మోసపోకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

'బలగం' కోసం తరలొచ్చారు..

నవతెలంగాణ-బోధన్/సదాశివనగర్

కుటుంబ బంధం.. అనుబంధాల గొప్పతనాన్ని తెలియజెప్పింది 'బలగం' సినిమా. దీంతో ఈ సినిమా థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న విషయం తెలిసిందే. అదే స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజల వద్ద అదే ఆదరణ పొందుతోంది. ప్రతి గ్రామంలో ఆయా గ్రామస్తులు బలగం సినిమాను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించుకుంటూ వారి కుటుంబ బాంధవ్యాలను గుర్తు చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి బోధన్ పట్టణంలోని ఓ కాలనీలో, సాలూరలో ఈ సినిమాను ప్రదర్శించారు. దాంతో జనం భారీగా తరలివచ్చి చిత్రం తిలకించారు. మహిళలు సినిమా కథలో లీనమై భావోద్వేగానికి గురయ్యారు. వారు కోల్పోయిన కుటుంబ అనుబంధాన్ని గుర్తు చేసుకుని కంటితడి పెట్టారు. ఏదేమైనా బలగం సినిమా కుటుంబ బంధాలను గుర్తు చేసిందని అంతటా కొనియాడుతున్నారు.



సాలూరలో చిత్రం తిలకించేందుకు వచ్చిన జనం

ఉత్తునూరులో బలగం సినిమా ప్రదర్శన..

సదాశివనగర్ : మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో బలగం సినిమాను బుధవారం రాత్రి ప్రదర్శించారు. హనుమాన్ మందిరం వద్ద పెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటుచేసి ప్రదర్శించడంతో గ్రామస్తులంతా సినిమా చూసేందుకు భారీగా తరలివచ్చారు. సినిమా చూస్తున్నంతసేపు మహిళలు, వృద్ధులు, మధ్య వయసు వారు తమ బంధాలను, బంధువులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇంత మంచి సినిమాను తమ దగ్గరికి తీసుకువచ్చి ప్రదర్శించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నిందితులను పట్టుకోవాలి

- దేవునిగుట్ట తండా గ్రామస్తులు రాస్తారోకో



కోటగిరి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కోటగిరి

రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి కారణమైన వారిని పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ.. మండలంలోని దేవుని గుట్ట తండా గ్రామస్తులు కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం సాయంత్రం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తక్షణమే నిందితులను పట్టుకోవాలని కోరారు. గంటసేపు రాస్తారోకో నిర్వహించడంతో ఎక్కడ వాహనాల అక్కడ నిలిచిపోయాయి. ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులను ఓదార్చి త్వరలోనే వాహనాన్ని గుర్తించి పట్టుకుంటామని హామీనివ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

ఉత్తమ పంచాయతీ ఇదేనా..?

- మురికి కాలువలో నిండిన చెత్తచెదారం
- దుర్వాసన వెదజల్లుతున్న వైనం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామ పంచాయతీ గతంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. కానీ గ్రామ సమీపంలోని మురికి కాలువలో చెత్త చెదారం నిండి కంపుకొడుతోంది. ఈ మురికి కాల్వకు ఆనుకుని వార సంత నిర్వహిస్తారు. దానికి ఆనుకొని బస్ స్టాప్ సైతం ఉంది. అయితే సమీపంలోని రోడ్డు వెంబడి వెళ్ళే బాటసారులు ముక్కు మూసుకుని వెల్లవలసి వస్తుంది. సర్పంచ్, ఉపసర్పంచ్ ఆప్రాంతములోనే ఉంటున్నా.. అక్కడి వార్డు మెంబర్ కూడ పట్టించు కోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తమ గ్రామ పంచాయతీ అంటే ఇదేనా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికి కాల్వలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారం

నిబద్ధతకు మారుపేరు.. కామ్రేడ్ బి.టి రణదివె

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు.. కామ్రేడ్ బి.టి రణదివె అని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ కొనియాడారు. గురువారం కామారెడ్డి సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ బిటి రణదివే 33 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 1904 డిసెంబర్ 19న మహారాష్ట్రలోని బొంబాయిలో జన్మించిన బి.టి రణదివె బ్రిటిష్‌కు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, బ్రిటిష్ కాలంలోనే బొంబాయిలో కార్మిక సంఘాలు స్థాపించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. భారత దేశంలో మొట్టమొదటి అఖిల భారత ట్రేడ్ యూనియన్ (ఏఐటీయూసీ) జాతీయనాయకుడిగా, 1970లో ఏర్పడిన నాటి నుంచి 1991 వరకు సెంటర్ ఆఫ్ ఇండియన ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారని వివరించారు. కార్మికుల ప్రయోజనాలే తప్ప సొంత జీవితం పట్ల ఆసక్తి లేని నిస్వార్ధ నేత బి.టి.ఆర్. తన తండ్రి అంత్యక్రియలకు కూడా వెళ్లకుండా కార్మిక పోరాటంలో ఉన్న తీరు కార్మికవర్గానికి ఆయన ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. తన చివరి కాలంలో 85ఏండ్ల వృద్ధాప్యంలో అనారోగ్యంతో ఉండి కూడా పని హక్కు సమస్యపై వ్యాసం రాశారని తెలిపారు. 1990లో చనిపోవడానికి కొద్ది రోజుల ముందు హాస్పిటల్లో మరణశయ్యపై ఉండి కూడా టైప్ రైటర్ తెప్పించుకొని తూర్పు యూరప్ దేశాల పరిణామాలపై ఒక డాక్యుమెంట్‌ని తయారు చేశారని, ఇది కార్మికోద్యమం పట్ల తన నిబద్ధతకు నిదర్శనమని వివరించారు. అలాంటి కమ్యూనిస్ట్ యోధుడు మన మధ్యన లేక పోయినా ఆయన వదిలి వెళ్ళిన ఆశయాలు ఇంకా అలానే ఉన్నాయని ఆనాడు సాధించుకున్న కార్మిక చట్టాలను నేటి పాలకుల విధానాల వల్ల హక్కులను హరించ బడుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమాలు నిర్మించడమే బీటీఆర్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని వివరించారు. కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

రాఘవ లైఫ్ సైన్స్ కెమికల్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొత్త నరసింహులు



మాట్లాడుతున్న కొత్త నరసింహులు

నవతెలంగాణ-భిక్కనూర్

రాఘవ లైఫ్ సైన్స్ యాజమాని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొత్త నరసింహులు తెలిపారు. మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న రాఘవ లైఫ్ సైన్స్ ల్యాబ్ నుంచి ప్రజల ప్రాణాలు తీసే విషవాయువును బయటకు వదులుతున్నారని, దీంతో పంఢ్ల పొలాల్లో పని చేసే కార్మికులు, రైతులు, ఇండ్లలో ఉండే ప్రజలు ఆ దుర్వాసనకు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. వాసన భరించలేక వాంతులు చేసుకుంటున్నారని ఈ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ కంపెనీలో రియాక్టర్ పేలి ప్రమాదం జరిగిన ఘటనలు ఉన్నాయని, కార్మిక సంఘాలను పెట్టనీయకుండా కనీసం దాంట్లో పనిచేసే కార్మికులకు కనీస సౌకర్యాలు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించకుండా స్థానికులు కాకుండా స్థానికేతరులతో పనులు చేయించుకుంటూ కార్మికులకు ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. ఈ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకునేంతవరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్, సిద్ధాగౌడ్, లక్ష్మణ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అఖండ హరినామ సప్తలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/బిచ్కుంద

మండలంలోని అంజని, వడ్లం గ్రామంలో గ్రామస్తులు నిర్వహించిన అఖండ హరిత పూజ సందర్భంగా నామ సప్త కార్యక్రమంలో భాగంగా గాత పూజ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే హనుమాన్ షిండే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, అంజలి, సర్పంచ్ పండరి పటేల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయ గౌడ్, వడ్లం సర్పంచ్ నగేష్ మల్లుగొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

బిచ్కుంద : హనుమాన్ జయంతి పండగ పురస్కరించుకొని బిచ్కుంద మండల కేంద్రంలో దాసహనుమాన్ మందిరంలో కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా దాస హనుమాన్ మందిరంలో పూజలు నిర్వహించి శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో పండగలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే హనుమంత్ షిండేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రజలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దత్తుపంతులు, నర్సింలు ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్ : హరినామ సప్తలో పాల్గొన్న ఎమ్మెల్యే

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మెగా సునీత రవి అన్నారు. మండలంలోని బాపునగర్ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం కంటి వెలుగును ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎడపల్లి ప్రభుత్వాసుపత్రి వైద్య అధికారి రాజ్ కుమార్, ఆస్పత్రి పాలన అధికారి రాములు, ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి దాతలకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బోరు బావి తవ్వకానికి కామారెడ్డి పట్టణానికి చెందిన పాత బాలకిషన్, బాలరాజు ముందుకు వచ్చినట్లు సర్పంచ్ జనగామ శ్రీనివాస్, గురు స్వామి బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఆలయంలో బోరు బావి దాతలకు హనుమాన్ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో కంటి వెలుగు వైద్య సిబ్బందికి గ్రామపంచాయతీ తరపున, సర్పంచ్ రామ్‌రెడ్డితో పాటు పాలక వర్గ సభ్యులు గురువారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్యుల సేవలు చాలా విలువైనవని, వెలకట్టలేనివని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గ్రామంలో 1761 మందికి కంటి పరీక్షలు నిర్వహించే లక్ష్యంగా కార్యక్రమం ఏర్పాటు చేయగా, గ్రామంలో 1115 మందికి సేవలందించి, అద్దాలు, ఉచితంగా మందులు అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేందర్, ఉప సర్పంచ్ నరేందర్, పాలకవర్గ సభ్యులు సాయిరెడ్డి, భాస్కర్ రెడ్డి, ముదాం నర్సింలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
నిజామాబాద్
2
శుక్రవారం 07 ఏప్రిల్ 2023

సాహితీ వారోత్సవాలకు ఆహ్వానం

నవతెలంగాణ-ముప్కాల్

అంతర్జాతీయ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రపంచ తెలుగు సాహితీ వారోత్సవాల్లో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు కవి, రచయిత తొగర్ల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముప్కాల్ పోలీసు స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న తొగర్ల సురేష్ పలు రకాల కవితలను పరిచయం చేశారు. ఈ మధ్యకాలంలో 'ఇందూరు విశిష్ట' కవి అవార్డును సైతం పొందారు. అంతర్జాతీయ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవ సంస్థ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ నెల 9,10 తేదీల్లో తిరుపతి జిల్లా మహతి ఆడిటోరియంలో 48 గంటల పాటు నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానం అందడం చాలా ఆనందంగా ఉందని తొగర్ల సురేష్ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన షాహూ వెంకటేష్ (35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. చెందిన వెంకటేష్ అర్ధరాత్రి సికింద్రాబాద్ నుండి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కృష్ణ ఎక్స్ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వీడీసీలను రద్దు చేయండి

- సీపీఐ వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వీడీసీలను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండల కేంద్రానికి పక్కనే ఉన్న రామన్న పేటకు చెందిన 300 ముదిరాజ్ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజక వర్గాల్లో కుల బహిష్కరణ చేయడం పరిపాటిగా మారిందని అన్నారు. గ్రామ ప్రజలు రాజ్యాంగబద్ధంగా ఎన్నుకున్న సర్పంచ్ వ్యవస్థను కాదని గ్రామ అభివృద్ధి కమిటీ (విడీసీలు) తయారై నియంత పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇది చట్టవిరుద్ధమని కావున వీడీసీలను రద్దు చేయాలని, రామన్న పేటకు చెందిన 300 కుటుంబాలకు న్యాయం చేయాలని కలెక్టర్ను కోరారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుకలో

ప్రజలను భాగస్వాములు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-నిజామాబాద్సిటీ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ నెల 14 న హైదరాబాద్ లో నిర్వహించతలపెట్టిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుక కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను భాగస్వాములు చేయాలని సంకల్పించడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి అన్నారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఆమె అంబేద్కర్ విగ్రహావిష్కరణ, గొర్రెల పంపిణీ కార్యక్రమాల పై సమీక్ష జరిపారు. 14వ తేదీ నాటి అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి జిల్లాలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆరు బస్సులలో కనీసం 300 మందిని హైదరాబాద్కు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల్లోపే విగ్రహావిష్కరణ సభా వేదిక వద్దకు ప్రజలు చేరుకునేలా చూడాలన్నారు. ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్తోపాటు ఏదైనా



వీసీలో మాట్లాడుతున్న శాంతికుమారి

శాఖకు చెందిన మరో అధికారిని వెంట ఉండేలా ఏర్పాటు చేయాలని, నిర్ణీత సమయంలో ప్రజలు కార్యక్రమానికి చేరుకొని, తిరుగు పయనం అయ్యేలా వీరు బాధ్యతతో పని చేయాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్కు తరలివచ్చే వారికి భోజన వసతి కల్పించాలని అన్నారు. ఇటీవల నిర్వహించిన ఆదివాసీ సభ తరహాలోనే ఈ కార్యక్రమాన్ని కూడా పకడ్బందీ ఏర్పాట్లతో విజయవంతం చేయాలని సూచించారు.

త్వరలో రెండవ విడత గొర్రెల పంపిణీ

రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టే అవకాశం ఉన్నందున, ఆలోపే ఈ పథకం అమలు కోసం క్షేత్ర స్థాయిలో అన్ని విధాలుగా



వీడియోకాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా అధికారులు

సన్నద్ధం అయి ఉండాలని చీఫ్ సెక్రెటరీ కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపిక, వారికి అవగాహన కల్పించడం, ఇతర రాష్ట్రాల నుండి గొర్రెల కొనుగోలు, వాటి రవాణా, లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాల పంపిణీ అంశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు బి.చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఆర్డీఓ చందర్, మెప్మా పీడీ రాములు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి శశికళ, డీ పీ ఓ జయసుధ, ఆర్ టి సి ఆర్.ఎం ఉషాదేవి, ఆర్డీఓలు రవి, శ్రీనివాసులు, పశు సంవర్ధక శాఖ జె.డి జగన్నాథ చారి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్యకేసులో జీవిత ఖైదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భార్య సనా బేగ పై గ్యాస్నూనె పోసి నిప్పంటించి హత్య చేసిన భర్త షేక్ ముజీబ్కు జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి షౌకత్ జహాన్ సిద్దికి గురువారం తీర్పుచెప్పినట్లు ఆరో పోలీస్స్టేషన్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం కోలూర్ గ్రామానికి చెందిన షేఖ్ రజాక్ తన కూతురు సనా బేగంను నిజామాబాద్ నగరంలోని నిజామ్ కాలనీవాసి అయిన షేక్ ముజీబ్ తో 2016 ఏప్రిల్లో వివాహం చేశారు. పెళ్లిలో లక్ష నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి ఆభరణాలను కట్నం రూపేణా చెల్లించారు. కానీ కొన్ని నెలల తర్వాత అదనపు కట్నం కోసం ముజీబ్ , ఆయన తోబుట్టువులు శారీరక, మానసిక వేధింపులకు గురిచేశారు. 18 ఏప్రిల్ 2017 అర్ధరాత్రి సమయంలో షేక్ ముజీబ్ ఎనిమిది నెలల గర్భిణి అయిన తన భార్య సనా బేగంపై గ్యాస్ నూనె పోసి నిప్పుపెట్టారు. కాలిన గాయాలైన ఆమెను ఇంటిలోని దీపం మీదపడి ప్రమాదవశాత్తు గాయాలయ్యాని నమ్మించి నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. గాయాలతోనే సనా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పసికందు 22 ఏప్రిల్ 2017న చనిపోయాడు. కాలిన గాయాలతో చికిత్స పొందుతూ సనా 25 ఏప్రిల్ 2017 న మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలకు తోడు పదమూడు ధృవీకరించుకున్న పత్రాలు, మరో రెండు సాక్ష్యాలు అధ్యయనం చేసిన కోర్టు ప్రధాన ముద్దాయి షేక్ ముజీబ్ పై నేరాభియోగాలు రుజువైనట్లు నిర్ధారించారు. హత్యానేరం ప్రకారం జీవిత కారాగార శిక్ష, కట్నం వేధింపులకు గాను ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పును ప్రకటించారు. మిగతా ముద్దాయిలపై నేరారోపణలు రుజువు కానందున వారిని నిర్దోషులుగా విడుదల చేశారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసనలలో పాల్గొన్న ఉపాధ్యాయసంఘం నాయకులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్ ఉన్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)ఆధ్వర్యంలో గురువారం నిజామాబద్ కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపటారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పరలి కృష్ణవేణి, బట్టు బద్రీనాథ్, రామకృష్ణారెడ్డి, వరప్రసాద్ నీలవేణి, శోభ, జిల్లా బాధ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి తెలంగాణగా మారుస్తాం

- బీఎస్పీలో చేరిన కళ శ్రీనివాస్



ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీలో చేరిన కళ శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్సిటీ

కొందరి తెలంగాణను అందరి తెలంగాణగా మారుస్తామని కళ శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజా నాయకుడు, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కళ శ్రీనివాస్ గురువారం బిఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో ప్రవీణ్ కుమార్ సమక్షంలో బిఎస్పీ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ అమరుల ఆశయాలతో బహుజన మహనీయుల సిద్ధాంతాల పునాదిగా నిజామాబాద్ జిల్లాలో ప్రతి పల్లె పల్లెనా బహుజన సమాజ్ పార్టీ ఏర్పాటుచేసి నీలి జెండా ఎగర వేస్తాను అని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పల్లికొండ నరసయ్య, ఉపాధ్యక్షులు సిలుముల గణేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రల్ల గంగాధర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జిన్న సంపత్, డాక్టర్ సంతోష్, సురేష్, సంతోష్ నాయక్, గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు

సమ్మేళనం విజయవంతం చేయండి

- సీపీఐ, సీపీఐ(ఎం)
- 9న ఎగ్జిబిషన్ గ్రౌండ్లో సభ

నవతెలంగాణ-నిజామాబాద్సిటీ

సమ్మేళనం విజయవంతం చేయాలని, ఈసమ్మేళనం ఈనెల 9న ఎగ్జిబిషన్ గ్రౌండ్లో ఉంటుందని సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. సీపీఐ నిజామాబాద్జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న విధానాలపై ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందని తెలిపారు. బిజెపి ఎన్నికలకు ముందు ఇచ్చినటు హామీలు నెరవేర్చక పోగా బీజేపీయేతర రాష్ట్రాలపై గవర్నర్లను, ఈడి, సీబీఐలను ఉపయోగించి పరిపాలనను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆదాని, అంబానీల కోసమే ప్రధాని మోడీ పని చేస్తున్నారని, కార్పొరేట్ సంస్థలకు ఈ మధ్యకాలంలో పది లక్షల కోట్ల రుణమాఫీ చేయడం సిగ్గుచేటని అన్నారు. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ నాంపల్లిలో జరిగే సమ్మేళనంలో సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులంతా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ, సీపీఐ(ఎం) అగ్ర నాయకులు డి.రాజా, సీతారాం ఏచూరి, డాక్టర్ కె.నారాయణ, బివి.రాఘవులు, చాడ వెంకటరెడ్డి కూనంనేని సాంబశివరావు, తమ్మినేని. వీరభద్రం, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని అన్నారు. జిల్లా, మండల నాయకులు సకాలంలో హాజరై సమ్మేళనసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు వై.ఓమయ్య, సీపీఎం నాయకులు పెద్ది.వెంకట్ రాములు, హనుమాన్లు, గోవర్ధన్, అనిల్, ప్రసాద్, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

అభంగపట్నంలో కుస్తీ పోటీలు



నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ, ఎస్ఐ, తదితరులు


నవతెలంగాణ-నవీపేట్

హనుమాన్ జయంతి సందర్భంగా మండ లంలోని అభంగ పట్నంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 100 మంది కుస్తీ యోధులు పోటీ పడగా 300, 500, వెయ్యి రూపాయలతో పాటు వెండి ఉంగరం, కడెంలకు కుస్తీ పోటీలు జరిగాయి. చివరి పోటీ ఎంపీపీ సంగెం శ్రీనివాస్ 5016 రూపాయల బహుమతికి నిర్మల్ జిల్లా తానూర్కు చెందిన షేక్ అక్తర్ మహంతం గ్రామానికి చెందిన గుండ్ల సాయిలు పోటీ పడగా షేక్ అక్తర్ గెలుపొందారు. ఆయనకు 5016 రూపాయలను ఎంపీపీ సంగెం శ్రీనివాస్ తో పాటు ఎస్సై రాజారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సంతోష్ రెడ్డి, పులి సాయిలు, ఉపసర్పంచ్ రాము, సురేష్, తదితరులు బహుకరించారు.

కోవిడ్కాలం ఫీజు మినహాయించండి

- వీసీకి పరిశోధక విద్యార్థుల వినతి

నవతెలంగాణ-డిచ్పల్లి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

కోవిడ్ కాలానికి ఫీజు మినహాయింపు చేయాలని వీసికి పరిశోధక విద్యార్థులు గురువారం వినతిపత్రం అంద జేశారు. ఈసందర్భంగా పరిశోధక విద్యార్థులు మాట్లా డుతూ.. తెలంగాణ యూని వర్సిటీలో 2013-14 సంవ త్సర పరిశోధక విద్యార్థులు 2017 డిసెంబర్లో అడ్మిషన్ పొందారని తెలిపారు. 2019 నుండి 2021 వరకు కరోనా వైరస్వల్ల లాక్ డౌన్ విధించారని, ఉపాధి లేక పరిశోధనాలు ఆగిపోయాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యూనివర్సిటీ నుండి ఎలాంటి ఫెల్లోషిప్లు రాలేదని, పరిశోధనల నయాపైస ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ యూనివర్సిటీలోనే లక్షల రూపాయలు పరిశోధన, కోర్సు ఫీజుకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దళిత, బహుజన, వెనకబడిన తరగతుల నుండి వచ్చిన వారే ఎక్కువ మంది పరిశోధనలో ఈ యూనివర్సిటీలో ఉన్నారని వివరించారు. కోవిడ్ సంవత్సరం ఫీజు ఈ విద్యాసంవత్సరం వరకు మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన వీసి రవీందర్ సంబంధిత అధికారులతో సోమవారం చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో వారిలో 2013--2014 బ్యాచ్ తెలంగాణ యూనివర్సిటీ పరిశోధన విద్యార్థులు రవి, నాగోల్ల రమేష్, ప్రవీణ్, మహేష్, కాశ గౌడ్ఉన్నారు.

ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర

- భక్తులకు మంచినీరు, అల్పాహారం ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే
- ఆలయాలవద్ద అన్నదానాలు
- ఘనంగా హనుమాన్ జయంతి

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన వీర హనుమాన్ విజయ యాత్రలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా గురువారం పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న 5వేలమంది హనుమాన్ భక్తులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంచినీరు, పండ్లు అల్పాహారం ఏర్పాట్లు చేసి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కంఠేశ్వర్ వద్ద హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వీర హనుమాన్ విజయ యాత్ర లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా నిజామాబాద్ నగర ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంచినీరు, పండ్లు, అల్పాహారం ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్ర శాంతి యుతంగా జరిగేందుకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నవీపేట్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాలతో పాటు మండలంలోని హనుమాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం నుండి నాగేపూర్ వెళ్ళు రహదారిలో గల వీర హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమర్ ప్రసాద్, శివారెడ్డి, ఓమ్ లాల్, జీవన్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ వినాయకనగర్లో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం, శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం దేవాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా యువ నాయకులు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు ధర్పల్లి జడ్పిటిసి, బాజిరెడ్డి జగన్మోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిచ్పల్లి జెడ్పిటిసి దాసరి ఇంద్ర లక్ష్మీ నర్సయ్య , డిచ్పల్లి మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ముప్కాల్: అన్నదానం చేస్తున్న లయన్స్ సభ్యులు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలంలో గాంధీనగర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో హనుమాన్ మందిరంలో శ్రీ పిట్ల కృష్ణ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, సర్పంచ్ అనూష లక్ష్మణ్ నాయక్ ఉపసర్పంచ్ గురువయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు మరయ్య పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలో పలు హనుమాన్ దేవాలయాల యందు హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గురువారం హనుమాన్ జయంతోత్సవాల సందర్భంగా 20 క్వింటాళ్ల బియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ, కౌన్సిలర్లు ఆకుల రాము, మేడిదాల సంగీత రవి గౌడ్,, కోన పత్రి కవిత కాశీరాం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చేపూర్ గ్రామంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శు రాలు కూరపాటి అరుణ జ్యోతి, బిసి జిల్లా అధ్యక్షులు శ్యాంప్రసాద్, శృంగారం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. వీర హనుమాన్ విజయ యాత్ర మామిడిపల్లి హనుమాన్ మందిరం నుండి ప్రారంభమై కొత్త బస్టాండ్ ద్వారా శివాజీ చౌక్ వరకు కొనసాగింది.

ముప్కాల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, రెంజర్ల, కొత్తపల్లి, నాగంపేట్, వెంచిర్యాల, నల్లూర్ గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను స్వాములు, భక్తుల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టారు. నల్లూర్ గ్రామంలో ములధారణ స్వాములు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముప్కాల్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటుక బట్టీల వద్ద కూలీలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జక్రాన్పల్లి : మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రతిఏటా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీలు గంగారెడ్డి, తలారి మరియా సతీష్, మండల కో ఆప్షన్ మెంబర్ బులెట్ అక్బర్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని పలు గ్రామాల్లో హన్మన్ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో గోపాల కాల్వను చేపట్టారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

మోపాల్: మంచిప్ప గ్రామంలో విడిసి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. అన్నదానం ఏర్పాటుచేశారు. ఆయన హనుమాన్ చాలీసా గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరు సిద్ధార్థ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నవీపేట్ మండలంలో..



నిజామాబాద్రూరల్: పాల్గొన్న ఎమ్మెల్యే బాజిరెడ్డి, జగన్



మోపాల్ : అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా, వినతి



ఆర్మూర్ : ఆలూర్లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/కమ్మర్పల్లి

రబీ సీజన్లో యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐకే సి ఎస్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పట్టణ తహసీల్దార్ కార్యాలయం, ఆలూర్ మండల కేంద్రము లోని తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సదర్భంగా ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు గంగన్న,రాజన్న మాట్లాడుతూ వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయివేటు వ్యాపాస్తుల బారినుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ లో యంయస్పి ధరలకు పంటలు కొనుగోలు చేయడంలేదని అన్నారు. అనేక వాణిజ్య పంటలకు యంయస్పి జాబితా లో లేవని, వీటి ములంగా వ్యాపార వర్గాలు సిండికేట్ అవతారమెత్తి కృత్రిమంగా ధర తగ్గించి రైతు నుంచి సరుకూ అమ్ముడుపోయిన తర్వాత ధర మార్కెట్లో పెరుగుతున్నాయన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేసి రైతులకు రెండింతలు ఆదాయం తెచ్చి పెడతామని హామీ హామీ గానే ఉందని ఎద్దేవా చేశారు. ఆహార పంటలు, వాణిజ్య పంటలను ఎంఎస్పీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రప్రభుత్వం ఎంఎస్పీ గ్యారెంటీ చట్టంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్లో ప్రతి రైతుకు పెట్టుబడి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యన్.నాగన్న, లింబాద్రి, మల్కన్న, గంగారెడ్డి, ప్రతాప్, ప్రవీణ్, శశి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్పల్లి : అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగొలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షులు సారా సురేష్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ సురేష్కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.అనంతరం సురేష్ మాట్లాడుతూ ఖరీఫ్కు ముందుగానే రుణాలు అందించిన ఈ రబీ సీజన్లో ధాన్యంతో పాటు మొకజొన్న, తదితర పంటలను ప్రభుత్వమే కొనుగొలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వందకు పైగా వ్యవసాయ పంటలు సాగు చేస్తుంటే 23పంటలకు మాత్రమే ఎమ్మెస్పీ జాబితాలో ఉన్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష ఏకకాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగాధర్, నాయకులు బాలయ్య, అశోక్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్పల్లి : తహసీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వంట పాత్రలు వితరణ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోర ఫంక్షన్ హాల్‌కు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.మూడు లక్షలతో వంట పాత్రలు గురువారం వితర ణ చేశారు. 500 కుర్చీలు, మైక్‌సెట్‌ను సైతం అందజేసినట్టు మండలాధ్యక్షులు తెలిపారు.



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

ప్రత్యేక పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్

ఆంజనేయస్వామి జయంతి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేసి వ్యవసాయ పనులను మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ గురువారం ప్రారంభించారు. ఎడ్లకు, అరకకు పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న సంగమేశ్వర్

ఘనంగా హనుమాన్ జయంతి

- ప్రత్యేక పూజలు చేసిన పలువురు
- పలు గ్రామాల్లో శోభాయాత్రలు
- పెద్దఎత్తున అన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలో హనుమాన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి.. శోభయాత్రలను నిర్వహించారు. పలుచోట్ల పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు.

మహారాష్ట్ర నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో కూల్ వాటర్ పంపిణీ..

మద్నూర్ : మూడు రాష్ట్రాలైన తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులో గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ దర్శనానికి ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతికి భక్తులు వేలాదిగా తరలివస్తారు. భక్తుల సహాయార్థం వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర దేగ్లూర్ తాలూకా అధ్యక్షులు మన్మత్ పర్భతే ఆధ్వర్యంలో భక్తుల కోసం సలాబత్పూర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన భక్తుల కోసం కూల్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమాకాంత్ కాశీనాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ మందిరంలో వేడుకలు..

మండల కేంద్రంలో గల లక్ష్మీనారాయణ ఆలయంలో ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు ఆలయ కమిటీ చైర్మన్ పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, మున్నూరు



ఎడపల్లి : శోభాయత్రలో నృత్యాలు చేస్తున్న స్వాములు

కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్ కుమార్, ఆలయ మాజీ చైర్మన్ పి.విజయ్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండలంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని హనుమాన్ దీక్ష స్వాములు గ్రామ గ్రామాన శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై పాండేరావు బందోబస్తు నిర్వహించారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

బోధన్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలో హనుమాన్ ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కోసం ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ పలు హనుమాన్ మందిరాలకు బియ్యం పంపిణీ చేశారు. బోధన్ పట్టణంలోని ప్రధాన హనుమాన్ ఆలయంలో దేవాదాయశాఖ భక్తులకు సౌకర్యాలు కల్పించి అన్నదానం చేశారు. నర్సాపూర్ హనుమాన్ ఆలయంలో పూజారి సురేష్ ఆత్మాశ్రయం మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో, అన్ని తాండాలో హనుమాన్ జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలరాజ్ గుడి ఆలయంలో గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పిట్లం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలలో అన్నదాన కార్యక్రమము నిర్వహించారు.



బోధన్‌లో అన్నదానం

చిన్నకొడప్‌గల్, పిట్లంలో బజరంగదళ్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, హనుమాన్ స్వాములు, ప్రజలు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

భిక్కనూర్ : మండలంలోని కంచర్ల, పెద్దమల్లారెడ్డి, భిక్కనూర్, సిద్దరామేశ్వరనగర్, బస్వాపూర్ తదితర గ్రామాలలో హనుమాన్ మాలధారులు, భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ మాలధరించిన హనుమాన్ స్వాములు మాల విరమణ కోసం ప్రత్యేక వాహనంలో కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్టు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 411 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 407 మంది విద్యార్థులు హాజరై నలుగురు గైర్హాజరైనట్టు వివరించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పల్లెల మడుగుతాండాలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను గురువారం స్థానిక సర్పంచ్ లక్ష్మితో కలిసి ఎంపీపీ రాధాబలరాం జడ్పీటీసీ శంకర్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ అజ్జు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల నర్సింలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో ఎడ్ల బండ్ల ప్రదర్శన



ఎడ్లబండ్ల ప్రదర్శన..

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ ఆలయం వద్ద గురువారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఎడ్లబండ్లను అందంగా అలంకరించి గ్రామంలోని హనుమాన్ ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి రాజయ్య, ఉపసర్పంచ్ రవి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ



పరీక్ష కేంద్రం వద్ద డీఎస్పీ

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం చుట్టూ 100 మీటర్ల వరకు 144 సెక్షన్‌ను ఉందని, గుర్తుతెలియని వ్యక్తులు పరీక్ష కేంద్రంలోకి రావడానికి వీలు లేదన్నారు. పోలీస్ పికెట్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎంతమంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారో వివరాల అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్, ఎస్సై శంకర్, పరీక్షల సిబ్బంది తదితరులు ఉన్నారు.

హంగర్గలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని హంగర్గా గ్రామంలో గురువారం సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ పద్మ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఉచితంగా కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలను అందించడానికి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని, కావున గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ పెద్దలు గంగాధర్, శ్యామ్ రావు, శివకుమార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు నిర్వహించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పిట్లం

ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనులు నిర్వహించి లబ్ధి పొందాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు అధికంగా ఉండడంతో కూలీలు ఉదయం పూటనే పనులు చేసుకుని రావాలని సూచించారు. కూలీలు నష్టపోకుండా ప్రభుత్వము సూచించిన కొలతల ప్రకారం పనులు నిర్వహించి అధిక డబ్బులు పొందాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అఫ్రోజ్, మెట్టు జ్యోతి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్‌లు, బదిలీలు చేపట్టాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్

నవతెలంగాణ-బోధన్

ఉపాధ్యాయుల ప్రమోషన్‌లు, బదిలీలను తక్షణమే చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి యానం విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కోర్టు కేసులతో సంబంధం లేని ప్రమోషన్లను చేపట్టి గత ఏడు సంవత్సరాలుగా నిలిచిపోయిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, వారి భవిష్య నిధిలో జమ చేసిన డబ్బులను వారి కోరిక మేరకు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన ఊరు మనబడి పథకం పనులు మే చివరి నాటికి పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్నీ సౌకర్యాలతో పాఠశాలలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమోషన్‌లలో అడ్డకేసిని తొలగించి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మాజీ ప్రధాని బాబు జగ్‌జీవన్‌రాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగన్న, జిల్లా అధ్యక్షులు సుధాం గడపలే, జిల్లా కార్యదర్శి బంటు భోజన్న, ఎంఈఓ నాగనాథ్, బోధన్ డివిజన్ ఉపాధ్యాయులు విఠల్ కాంబ్లే, మారుతి వాలేకర్, పోతురాజు లింగం, మాధవరావు, వేంకట్, వంశీ కృష్ణ, మల్లీకార్జున్, ప్రసాద్, విజయ్, అంతేశ్వర్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో '10 కిలోల సన్న బియ్యం ఇవ్వాలి'

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం రేషన్ దుకాణాలలో ఉచితంగా 10 కిలోల బియ్యంతో పాటు సబ్సిడీపై వంట గ్యాస్, 12 రకాల నిత్యావసర సరుకులను ఇవ్వాలని పీఓడబ్ల్యూ పట్టణాధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణంలోని గ్రామ చావిడి వద్ద పీవైఎల్ – పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల కేంద్రం ఐదు కిలోలు, రాష్ట్రం ఐదు కిలోలు కలిపి పది కిలోల సన్న



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బియ్యాన్ని తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారికి ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బియ్యంతో పాటు 12 రకాల నిత్యావసర సరుకులను చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని, సగం ధరకే సబ్సిడీపైన ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులకై దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే రేషన్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమా, పార్వతి, సరూప, గంగామణి, భూదేవి, ఈ రామని, సరోజన యువజన సంఘం తరపున కుమార్, శ్రీనివాస్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ డీఎస్పీకి సత్కారం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఖండేబల్లూర్ గ్రామంలోని హనుమాన్ మందిరంలో హనుమాన్ జయంతి సందర్భంగా నల్గొండ డీఎస్పీ మొగులయ్య దంపతులకు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహనంద, బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్ దేశాయి మాట్లాడుతూ.. మొగులయ్య ఖండేబల్లూర్ గ్రామవాసి కావడం, పేదకుటుంబంలో పుట్టి పోలీసుశాఖలో ఉన్నత ఉద్యోగం డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారని, ప్రతియేటా గ్రామములో నిర్వహించే హనుమాన్ జయంతి సందర్భంగా తప్పకుండా రావడం హర్షనీయమని తెలిపారు.

పనులు పరిశీలన..

గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను సర్పంచ్ మహనంద, నాయకులు, హెచ్ఎం జనార్దన్ స్లాబ్ పనులను గురువారం పరిశీలించి పనులను నాణ్యతగా చేయాలని గుత్తేదారునికి సూచించారు.



డీఎస్పీని సన్మానిస్తున్న పలువురు

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

నవతెలంగాణ-సదాశివనగర్

వచ్చే ఎన్నికల్లో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధారి ఎక్స్‌రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్డులను మండలంలోని అన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు, బూత్ ఎన్రో లకు పంపిణీ చేశారు. ఉత్తునూర్, ధర్మారావుపేట్, సదాశివనగర్ గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వడ్డేపల్లి సుభాష్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వారు మాట్లాడుతూ.. ఎల్లారె డ్డి నియోజకవర్గంలో సుభాష్‌రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి సుభాష్‌రెడ్డి ఆధ్వ ర్యంలో పార్టీలో పని చేస్తామని ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమ న్నారు. కార్యక్రమంలో మండల ఉపా ధ్యక్షులు కాట్మండీ సంతోష్ పాటిల్, మండల ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రె స్ అధ్యక్షులు కోతిలింగారెడ్డి, గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని చాటుకున్న ముస్లిం

నవతెలంగాణ-మద్నూర్

ముస్లిం వ్యక్తి మత సామరస్యాన్ని చాటుకున్నాడు. గురువారం ఆంజనేయ స్వామి జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని మేనూర్ గ్రామంలో 'భజరంగ బలి.. జై హనుమాన్ గద్దెపైన జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైయస్సార్ తెలంగాణ పార్టీ కామారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ రైస్ కాన్ పాల్గొన్నారు. ముస్లిం అయినా.. జై హనుమాన్ కండువా వేసుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి తన మతసామరస్యాన్ని చాటుకున్నాడు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వై.గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



గాంధారి : వేడుకల్లో నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ పటేల్, కంచన్వార్ యాదవ్ రావు, వీరేశం, వెంకట్ కాలే, సంతోష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఈ కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షులు కమలాకర్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కందునూరి దయానంద గౌడ్, సాయి, పురం శేఖర్, కందునూరి గంగా శేఖర్, బండ కృష్ణ, బాబి కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు జెండాను ఎగరవేశారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బక్కోళ్ల కిష్టయ్య, గంగిరమేష్, భైరవ ప్రసాద్, సాయ గౌడ్, శ్రీకాంత్, వడ్ల శ్రీనివాస్, బాలా అర్జున్‌గౌడ్, మహేందర్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శివ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ కార్యకర్తలకు, శ్రేయోభిలసులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ రాజ్, నియోజకవర్గ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ డాకూరి వెంకట్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గోపాల్, వెంకటేష్, కొండ సత్యం, సాయి కిరణ్ యాదవ్, మహేష్ పాల్గొన్నారు.

రాజంపేట్ : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గంగారెడ్డి మాట్లాడారు.

గొడుగుమర్రి తండాలో బోరు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగుమర్రి తండాలో బోరు పనులను గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ మాట్లాడుతూ.. తాగునీటి ఎద్దడిని నివారించడానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నిధుల నుంచి బోరు పనులను ప్రారంభించామని, ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరఫున గంప గోవర్ధన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం గంగారెడ్డి, బాబురావు, పీర్ సింగ్, రామచందర్, పరశురాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అరెస్ట్ చేయలేదని అన్నారు. చైర్మన్ ను ఎందుకు అరెస్ట్ చేయటం లేదని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన నిరుద్యోగులకు లక్ష రూపాయలు చెల్లించాలని, ఉచిత కోచింగ్ వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముట్టడి చేసిన దాదాపు 100 మంది పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులను కార్యకర్తలను అరెస్ట్ చేశారని తెలిపారు.



బోరు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలని రాజేశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది జీవితాలతో చెలగాటం ఆడుతున్న టిఎస్పిఎస్సి ని ప్రక్షాళన చేయాలని గురువారం హైదరాబాద్ లోని టిఎస్పిఎస్సి బోర్డ్ ముట్టడికి పీడీఎస్‌యూ. పీవైఎల్ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నం చేయగా తీవ్ర ఉద్రిక్తత ఏర్పడి పోలీసులకు నాయకులకు తోపులాట జరిగింది. నిజామాబాద్ నుండి వెళ్లిన పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వనమాల సత్యం, ప్రిన్స్, దేవిక, నిఖిల్, పివైఎల్ భాస్కర్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకల్లో రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సతీ సమ్మేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులు స్వామి వారికి వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద చిన్నారులను ఎత్తుకొని మంత్రి ముద్దాడారు.



16న హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-ఆర్మూర్

చేయూత స్వచ్ఛంద సంస్థ, ఎంజె హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మధుశేఖర్ గారి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ ఈనెల 16న భీంగల్ పట్టణంలో హెల్త్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్టు క్యాంపు ఇన్చార్జిలు డాక్టర్ వసంతకుమారి, సిరి, ఆశ హాస్పిటల్ వైద్యులు లింగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ప్రశాంత్ రెడ్డి పాల్గొననున్నారని, పేర్కొన్నారు. మైనర్ ఆపరేషన్లు అవసరమైన వారు ఈనెల 15వ తేదీ పెర్కిట్ ఎంజే హాస్పిటల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, 45 మందికి పైగా వైద్య నిపుణులు పాల్గొంటున్నారని వారు తెలిపారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఇటీవలే పూర్తయిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2018 , 2019లో జరిగిన ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎం ల గురించి కలెక్టర్ ఆరా తీయగా, వాటిని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేరళ, తమిళనాడు, గోవా, పంజాబ్ రాష్ట్రాలకు తరలించడం జరిగిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాకు వీవీప్యాట్లు, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు అన్నీ కూడా కొత్త వాటిని కేటాయించారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అనుకోని రీతిలో ప్రమాదాలు సంభవించిన సమయాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన అగ్నిమాపక సామగ్రి, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, అగ్నిమాపక శాఖకు చెందిన అధికారి నర్సింగ్ రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాలు తనిఖీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) జి. మధుసుదన్ రావు ఎస్.ఎస్.సి పరీక్ష కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. ఆదర్శ హింది మహా విద్యాలయం స్కూల్ - బస్టాండ్, కాకతీయ హై స్కూల్ - పులాంగ్, ప్రభుత్వ హై స్కూల్ - ఖిల్లా, విశ్వోదయ హై స్కూల్ ఆర్యానగర్ మొదలగు పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత సెంటర్ సూపరింటెండెంట్లు అన్ని వివరాలను అడిగి తెలుస్కుఉన్నారు. ఎవ్వరు కూడా సెల్‌ఫోన్లు తీసుకు రాకుండా చూడాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి కాపింగ్ జరుగకుండా చూడాలని అన్నారు. విధినిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఆయనతోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ

పరీక్షకు 72మంది గైర్హాజరు

మూడో రోజు పదోతరగతి పరీక్షలో గురువారం 72 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ప్రకటనలో తెలిపారు. మొత్తం కేంద్రాలు 138, మొత్తం అభ్యర్థులు రెగ్యులర్, ప్రైవేట్ కలుపుకొని 21,642 మంది అభ్యర్థులు పరీక్ష రాయల్సి ఉండగా 21578 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. డీఈవో 8 పరీక్ష కేంద్రాలను తనిఖీలను నిర్వహించగా, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేసినట్లు తెలిపారు.


పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

పెర్కిట్లో జెండా ఆవిష్కరణ


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ నందు అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు ఆధ్వర్యంలో బిజెపి జెండా ఆవిష్కరించారు. దేశంకోసం, పార్టీకోసం ప్రాణాలర్పించిన కార్యకర్తలను స్మరించుకున్నారు. ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు కృషి చేసిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మద్దతుదారుల భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు యామాద్రి భాస్కర్ , జెసు అనిల్ గుగులోత్ తిరుపతి నాయక్, పులి యుగేందర్, రాజేశ్వర్, వాసు, అరవింద్, లింబాద్రి, నవీన్, కృష్ణ వివిధ మోర్చా ల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలోని 30, 31, 32, 36 వార్డులలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓబిసి పట్టణ శాఖ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, జెస్సు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఆరెళ్ళ కమలకు 44వేలు, సాంబోజి సుస్మితకు 30వేలు, బూస లిఖితకు 12వేల రూపాయల చెక్కులను అర్గుల్ సర్పంచ్ ఉప సర్పంచ్ పద్మా రాజేందర్ అందజేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, సుధాకర్, భూ శంకర్, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.

సునీత చోప్రా ఆశయ సాధనకు కట్టుబడి ఉంటాం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కామ్రేడ్స్ సునీత చోప్రా ఆశయ సాధనకు కట్టుబడి ఉంటామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు అన్నారు. గురువారం సంఘ కార్యాలయంలో సునీత చో ప్రా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట రాములు మాట్లాడుతూ.. కామ్రేడ్ సునీత్ చోప్రా 1991 నుండి కలకత్తాలో జరిగిన 10వ అఖిలభారత మహాసభల వరకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా జాయింట్ సెక్రటరీగా పని చేశారని తెలిపారు. అలాగే సిపిఎం పార్టీ సెంట్రల్ కమిటీ మెంబర్‌గా దేశ ప్రజలకు అనేక సేవలందించారన్నారు. 'ఉపాధి హామీ చట్టం' సాధనలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈనెల 5న ఢిల్లీలో చేపట్టి కిసాన్ మద్దూర్ సంఘర్ష ర్యాలీ - బహిరంగ సభకు హాజరయ్యేందుకు వస్తుంగా మార్గమధ్యలోనే గుండె ఆగిపోయి అంతిమ శ్వాస విడిచారని తెలిపారు. అంతిమ శ్వాస వరకు దేశం గురించి ఆలోచించిన పారదర్శక మహా విప్లవకారుడని, ఆయనకు మన జిల్లాతో కూడా అనేక దగ్గర సంబంధాలు ఉన్నాయని తెలిపారు. 2012లో అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ యాత్రకు నిజామాబాద్ మీదుగా హైదరాబాద్ వెళుతున్న టీంకు ఆయన నాయకత్వం వహిస్తూ నిజామాబాద్ లో రెండు రోజులపాటు గడిపారని ఆ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఘన నివాళు లర్పించారు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉంటామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో హైమద్, నరేష్, గోవర్ధన్, రామ్మోహన్‌రావు లు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

అక్రమ అరెస్టుల పట్ల తీవ్ర ఖండన

నవతెలంగాణ-ఆర్మూర్

పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకుల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, అరెస్టు చేసిన వారిని వెంటనే భేషరతుగా విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్పీఎస్సీ బోర్డ్ చైర్మన్ జనార్దన్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని,, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థి, యువతకు ప్రభుత్వమే ఉచితంగా కోచింగ్, హాస్టల్ సౌకర్యాలు కల్పించాలని, స్టడీ మెటీరియల్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవ తరగతి పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, విద్యార్థి నిరుద్యోగ యువతతో చెలగాటమాడుతున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, యువతలను కోరారు. ఇప్పటికైనా బిశ్వాల్ కమిటీ చెప్పినట్లు ఉద్యోగ భర్తీలన్నీ వెంటనే యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి యువజన నాయకుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కంటి వెలుగు వైద్య బృందానికి సన్మానం


కంటివెలుగు వైద్యబృందాన్ని సన్మానించిన జీపీ, వీడీసీ వారు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కంటి వెలుగు ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో వైద్య బృందం, ఆశా వర్కర్లను గ్రామ పంచాయతీ, విడీసీ ఆధ్వర్యంలో శాలువాలతో గురువార సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా దేవరాజు, ఉపసర్పంచ్ సుప్రియ నరసింహారెడ్డి, ఎంపీటీసీ పోతే రాజు, వీడీసీ అధ్యక్షులు కొప్పు రాజు, సభ్యులు మోహన్, జీపి కార్యదర్శి, కారోబార్, వాటర్ మెన్, వార్డు సభ్యులు, వీడిసి సభ్యులు పాల్గొన్నారు.

అన్ని కులాలకు సమన్యాయం

- రూ.46 లక్షల ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అన్ని కులాలు, వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో రూ.46 లక్షల రూపాయల విలువగల ఎస్డీఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ కుల సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ..

కొందరు మాటల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేసిన తర్వాత కంటికి కనబడరని, అలాంటి వారికి ప్రజలు తగిన సమయంలో తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కుల సంఘాల సభ్యులకు, ప్రజాప్రతినిధులకు ఎస్డీఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలివేరి గంగా దాస్, జాగృతి మండల అధ్యక్షులు గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ లావణ్య రవి, గ్రామ శాఖ అధ్యక్షులు పిండి గంగాధర్, నర్సారెడ్డి, రామ్‌రెడ్డి, రాకేష్ గౌడ్, రాజుకుమార్, గణేష్, కుమారి శ్రీను, పి. గంగాధర్, మంగలి శ్రీనివాస్, సతీష్, వివిధ కుల సంఘ నాయకులు, కార్యకర్తలు గ్రామ కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

అర్చన బారడికి డాక్టరేట్



నవతెలంగాణ- ఆర్మూర్

పట్టణానికి చెందిన అర్చన బారడి జంతుశాస్త్ర విభాగంలో పీహెచ్డీ డాక్టరేట్ పొందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. రాజస్థాన్లోని శ్రీధర్ విశ్వవిద్యాలయంలో డిఫరెంట్ స్టేజెస్ ఆఫ్ ఫిజికో కెమికల్ క్యారెక్టర్స్ ఆఫ్ సిల్లీసర్ లేటు విత్ స్పెషల్ రిఫరెన్స్ టు జూ ప్లాంటన్ ఫిష్ పానా డైవర్సిటీ ఈజిడ్ అనే అంశంలో పరిశోధన చేసినందుకు వీరికి డాక్టరేట్ పొందారు. తన భర్త సుమన్ విశ్వనాథ్ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో తాను డాక్టరేట్ పొందినట్టు అర్చన బారడి తెలిపారు. ప్రస్తుతం మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగంలో 12 సంవత్సరాలుగా అధిపతిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పెద్దన్న, అధ్యాపక బృందం తదితరులు ఆమెను అభినందించారు.

అంధత్వ నిర్మూలనకే కంటివెలుగు


కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-సిరికొండ

అంధత్వ నిర్మూలనకే కంటి వెలుగు కార్యక్రమమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరికొండ సర్పంచ్ యెన్నం రాజారెడ్డి కోరారు. గురువారం మండలకేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఉపసర్పంచ్ బాడల రామ కృష్ణ తో కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కంటి వెలుగు ఎంతో మంది జీవితాలలో వెలుగును ప్రసాదిస్తుందని, గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దువ్వూరి భాస్కర్ రెడ్డి,వార్డ్ సభ్యులు శంకర్, ముషీర్, గంగాధర్, రామస్వామి, పంచాయితీ కార్యదర్శి సుమన్, మండల వైద్య అధికారి అరవింద్, కారోబార్ ప్రవీణ్, ఆసుపత్రి సిబ్బంది,గ్రామపజలు పాల్గొన్నారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లోగల క్షత్రియ జూనియర్ కళాశాల, క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్ చేపూర్ వారు నిర్వహిస్తున్న ఉచిత ఎంసెట్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు గురువారం తెలిపారు.

కోచింగ్ ఈనెల 3 నుండి ఎంసెట్ పరీక్ష ప్రారంభమయ్యే వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మంచి ర్యాంకులు సంపాదించి మంచి నైపుణ్యం గల కళాశాలలో సాంకేతిక విద్యను అభ్యసించి దేశ సేవకు పాటుపడాలి అని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కోశాధికారి అల్జాపూర్ దేవేందర్ తెలిపారు. ఇందులో వివిధ ప్రాంతాల కళాశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం జరిగినది. ఇంకా ఎవరైనా విద్యార్థులు అడ్మిషన్ చేసుకోవాలనుకునేవారు ఈనెల 10లోపు పేరు నమోదు చేసుకోగలరని క్షత్రియ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ యాజమాన్యం తెలిపారు.

స్కాలర్ పాఠశాలలో ఫైలేరియా లింపాటిక్ సర్వే

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లోని స్కాలర్ ప్రైవేట్ పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో "ఫైలేరియా లింపాటిక్ సర్వే" గురువారం నిర్వహించారు. ఈ పాఠశాలలో (1, 2వతరగతి) చదువుతున్న 35 మంది పిల్లలకు రక్తపరీక్ష లు నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనసా పరిశీలించి సలహాలు ఇచ్చారు.. సబ్ యూనిట్ ఆఫిసర్ సాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్ సుపర్ వైసర్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్ ఆరోగ్య కార్యకర్తలు శ్యామల,పండరీ ఆశాలు, ప్రధానోపాధ్యాయులు వేణు, ఉపాధ్యాయులు సహన తదితరులు పాల్గొన్నారు..

చలివేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పీటీసీ జగన్


చలివేంద్రాన్ని ప్రారంభించిన బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్‌లోని వినాయక్‌నగర్‌లో శ్రీశివాజీ మహారాజ్ సేవాసమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా యువ నాయకులు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ గురువారం ప్రారంభించారు. సేవాసమితి వారిని అభినందించారు.

నాలుగో డివిజన్ పరిధిలో గల బ్యాంక్ కాలనీ శ్రీ లక్ష్మీ బాలాజీ టైల్స్ మరియు శివాజీ మహారాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేయగా ధర్పల్లి జెడ్పిటిసి సభ్యులు బాజిరెడ్డి జగనన్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ అధ్యక్షులు నా గళ్ళ శ్రీకాంత్ చౌదరి, బీసి అధ్యక్షులు మల్లెపూల నరసింహ చారి, ప్రచార కన్వీనర్ మల్లెపూల నవీన్ కుమార్, సేవా సమితి అధ్యక్షులు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ బీటీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కామ్రేడ్ బీటీఆర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కామ్రేడ్ బీటీఆర్ 33 వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. గురువారం బీటీఆర్ 33వ వర్ధంతి సందర్భంగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ బార్డర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. బిటిఆర్ పూర్తి పేరు బాలచంద్ర త్రయంబక్ రణదివే.1904లో బొంబాయిలోని దాదర్‌లో జన్మించిన ఆయన ట్రేడ్ యూనియన్ ఉద్యమమే ఊపిరిగా సాగిందన్నారు. ఎం.ఏ (అర్థశాస్త్రం)లో బంగారు పతకం సాధించిన బిటిఆర్ బ్రిటిష్ ప్రభుత్వ సర్వీసులోకి వెళ్ళి వుంటే ఎన్నో ఉన్నత పదవులు సంపాదించి వుండేవారని, భారతదేశంలో జనాభా సమస్య"పై ఆయన థీసిస్‌ను బొంబాయి విశ్వవిద్యాలయం ప్రచురించిందని తెలిపారు. జీఐపీ (గ్రేట్ ఇండియన్ పెనిన్సులార్ రైల్వే) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత రైల్వే కార్మికులను ఆయన రెచ్చగొట్టాడన్న నేరానికి కఠిన కారాగార శిక్ష విధించారన్నారు.

1946లో జరిగిన నావికా తిరుగుబాటు (ఆర్ఐఎన్)కు మద్దతుగా బొంబాయి కార్మిక వర్గాన్ని వీధి పోరాటాల్లో నిలపడంలో బిటిఆర్ ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. 1948లో రెండవ మహాసభలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆయన ఆ తర్వాత పార్టీ తీసుకున్న నిర్మాణ చర్యకు గురయ్యారన్నారు. అన్ని బాధ్యతాయుత స్థానాల నుండి తప్పించినా ఒక సైనికుడి వలె ఉక్కు క్రమశిక్షణ పాటించారని తెలిపారు. 1962లో చైనాతో జరిగిన సరిహద్దు యుద్ధం సందర్భంగా అరెస్టైన బిటిఆర్.1964లో సీపీఐ(ఎం) ఏర్పాటు సందర్భంగా జైల్లోనే ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ బిటిఆర్ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, డీవైఎఫ్ఐ నాయకులు సూరి, లావణ్య లక్ష్మి, శాంతి, రాధా తదితరులు పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

- ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి అని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే బాజరెడ్డి

లాబ్దిదారులకు అందజేశారు. ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన వై . గంగాధర్‌కు లక్షా50వేల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకు ముందు షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాధావత్ రమేష్ నాయక్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలివేరి గంగా దాస్, జాగృతి మండల అధ్యక్షులు గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ లావణ్య రవి , గ్రామ శాఖ అధ్యక్షులు పిండి గంగాధర్, నర్సారెడ్డి, రామ్ రెడ్డి, రాకేష్ గౌడ్, రాజుకుమార్, గణేష్, కుమారి శ్రీను, పి. గంగాధర్, మంగలి శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.